

23 నుంచి దివ్యాంగులకు సదరం క్యాంపులు

ములుగు కలెక్టరేట్, జూలై 19 : ములుగులోని ఏరియా ఆస్పత్రిలో ఈనెల 23 నుంచి అక్టోబరు 8వ తేదీ వరకు సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో డాక్టర్ పి.జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని దివ్యాంగుల సదరం క్యాంపులు నిర్వహించడానికి మూడు నెలల షెడ్యూల్‌ను విడుదల చేశారు. జిల్లాలోని కొత్తగా సదరం ధ్రువీకరణ పత్రం పొందాలనుకున్న వారు, గడువు ముగిసిన సదరం ధ్రువీకరణ పత్రం పునరుద్ధరించుకోవాలనుకునే

మిగతా 8వ పేజీలో...



వాజేడు మండలంలోని పూసూరు-ముల్లెకట్ట వంతెన వద్ద గోదావరి ప్రవాహం

విస్తారంగా.. వాన

- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు
- పెరుగుతున్న గోదావరి ఉధృతి
- పరిస్థితిని పరిశీలించిన ములుగు కలెక్టర్ దివాకర
- సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు

ములుగు/భూపాలపల్లి, జూలై 19: జయశంకర్ భూపాలపల్లి, ఏజెన్సీ అయిన ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ములుగు జిల్లాలో 59మి.మీ సగటు వర్షపాతం నమోదవగా, అత్యధికంగా ఏటూరునాగారం మండలంలో 88.2మి.మీ, వాజేడులో 89.6మి.మీ వర్షం కురిసింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలోకి వరద పోటెత్తింది. సమ్మక్క బ్యారేజీకి 4లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా అంతే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ఏటూరునాగారం, మంగపేట వద్ద నీటిమట్టం పెరుగుతోంది. పలుచోట్ల కరకట్ట బలహీనపడగా ఇసుక బస్తాలు వేసి మరమ్మతు చేస్తున్నారు. వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్ దివాకర సహాయక చర్యలపై అధికారులను అప్రమత్తం చేశారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వాగులు ఉధృతంగా ప్రవహి స్తుండటంతో ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లోని పలు ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి అన్ని గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో వాజేడు మండలంలో గోదావరికి వరద నీరు భారీగా వస్తోంది.



భూపాలపల్లి ఏరియాలోని ఓసీ-2 క్వారీలో నిలిచిన నీరు

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి గల్లంతు

వెంకటాపురం(నూగూరు) మండలం ఆలుబాకకు చెందిన బానారి రాజు అనే వ్యక్తి గోదావరిలో గల్లంతయ్యాడు. చేపలు పట్టేందుకు వెళ్లిన ఆయన వరదలో గల్లంతయ్యాడు. నదీ ప్రవాహం అధికంగా ఉండటంతో ఆచూకీ లభ్యం కాలేదు.

బొగత..

జలసవ్వడుల పులకరింత..

తెలంగాణ నయాగరాగా పేరొందిన వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు, మూడు రోజులుగా తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వస్తున్న వరదలతో బొగత ఉప్పొంగుతోంది. జలపాతం ముందరి భాగంలోని ట్రీహౌజ్ వరకు వరద నీరు చేరగా.. అల్లంత ఎత్తునుంచి దుంకుతున్న జలధారలను చూసి సందర్శకులు పులకరిస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ, జలపాతం అందాలను కెమెరాలలో బంధిస్తూ మురిసిపోతున్నారు.

- వాజేడు



జలపాతం వద్ద పర్యాటకుల సందడి

భూపాలపల్లి జిల్లాలో కుండపోత

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 69.6 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు చేరింది. కాటారం మండలంలోని పలు గ్రామాలకు గంటల వ్యవధికి రాకపోకలు నిలిచిపోయాయి. సింగరేణి ఓపెన్ కాస్టుల్లో నీరు నిలిచి బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. కాటారం మండలంలోని బొర్రవాగు, అలుగువాగు, బండలవాగు పొంగి పొర్లాయి. అలుగువాగు వద్ద బొలెరో వాహనం కొట్టుకుపోగా డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. గుమ్మళ్లపల్లిలో పాత ఇల్లు కూలిపోయింది. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలకు వరదనీరు చేరాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 ఎకరాల్లో పత్తి, వరి పంటకు నష్టం వాటిల్లింది. నిమిష నిమిషానికి కాళేశ్వరం గోదావరి 8.320 మీటర్లు ప్రవహించింది. అలాగే, మేడిగడ్డ వరద ఉధృతి తీవ్రమై 3.10 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించింది.



కాటారం మండలం గోపాల్‌పూర్‌లో వాగు ఉప్పొంగి పత్తి పంటలో చేరిన వరద



కాటారం మండలం గుమ్మళ్లపల్లిలో కూలిన కుడిమెత సమ్మక్క ఇల్లు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పట్టణంలో ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూలై 19: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లిలోని మంజూర్‌నగర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయడంలో తెలంగాణ దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. రాష్ట్రంలోని రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడంతో పండగ వాతావరణం నెలకొందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన 7 నెలల్లో మూడు నెలలు ఎలక్షన్ కోడ్‌లో పోయినప్పటికీ ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడంలో ముందుకు కొనసాగుతున్నామని చెప్పారు. ఇప్పటికి రూ.31వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని, మిగిలిన వారికి ఆగస్టు 15 వరకు చెల్లిస్తామన్నారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా చేసిందన్నారు. దానికి చెల్లించాల్సిన మిత్తి కోట్లల్లో ఉన్నప్పటికీ రైతుల కళ్లల్లో ఆనందం చూసేందుకు సీఎం రుణమాఫీ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవన్, మధు, తోట రంజిత్ శ్రీనివాస్, రాజేందర్, రజినీకాంత్, పృథ్వీ, మహేందర్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి

భూపాలపల్లిటౌన్, జూలై 19: భూపాలపల్లి నియోజకవర్గంలో ఈనెల 21న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కల పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోరికొత్తపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ నూతన భవనాలను మంత్రులు ప్రారంభిస్తారని అన్నారు. గణపురం మండలం గాంధీనగరం సమీపంలో సుమారు 50 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కు కోసం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం జరగనున్న భారీ బహిరంగ సభలో మంత్రులు ప్రసంగిస్తారన్నారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, రైతులు, యువకులు, మహిళలు, తాజా, మాజీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. బహిరంగ సభ ముగిశాక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు దేవన్, మధు, తోట రంజిత్ శ్రీనివాస్, రాజేందర్, రజినీకాంత్, పృథ్వీ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గనుల్లో భద్రతను పెంచుతాం

- ప్రమాదరహిత సంస్థగా సింగరేణిని మార్చుతాం
- రక్షణ త్రైపాక్షిక సమావేశంలో సీఎండీ బలరామ్

వివరాలు 8వ పేజీలో..

లోతట్టు ప్రజలు అధైర్యపడొద్దు

- ములుగు కలెక్టర్ దివాకర
- రామన్నగూడెం పుష్కర ఘాట్, కొండాయి బ్రిడ్జి పరిశీలన



మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ఏటూరునాగారం రూరల్, జూలై 19 : గోదావరి, జంపన్నవాగు పరీవాహక ప్రాంతాల ప్రజలకు వరదల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని, ముంపు ప్రాంతాల ప్రజలెవరూ అధైర్య పడొద్దని జిల్లా కలెక్టర్ దివాకర అన్నారు. శుక్రవారం ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి నది, దొడ్ల-మల్యాల గ్రామాల మధ్య గల జంపన్నవాగును కలెక్టర్ పరిశీలించారు. రామన్నగూడెం పుష్కరఘాట్‌కు చేరుకున్న కలెక్టర్ అక్కడ గోదావరి ఉధృతితో పాటు కరకట్టను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్నందున కరకట్ట దెబ్బతినకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. వరద ఉధృతికి కరకట్ట కొన్ని ప్రాంతాల్లో దెబ్బతింటున్నదని, గోదావరి సుడులు తిరుగుతూ కోతకు గురవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆ ప్రదేశాల్లో మరమ్మతు పనులను వేగవతం చేస్తున్నామన్నారు. కరకట్ట నిర్మాణానికి జీయోట్యూబ్ సొల్యూషన్ సాంకేతికతతో కరకట్ట నిర్మాణానికి డిజైన్ సిద్ధంగా ఉందని, ఆడిజైన్ ప్రకారం కరకట్ట నిర్మాణాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. గోదావరి నది ఉధృతితో పాటు కరకట్ట పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

కొండాయి వద్ద వరద ఉధృతి పరిశీలన

మండలంలోని దొడ్ల-మల్యాల గ్రామాల మధ్యగల జంపన్నవాగు వద్ద వరద ఉధృతిని కలెక్టర్ దివాకర పరిశీలించారు. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతితో కరకట్టను పరిశీలించిన అంతరం దొడ్ల వద్దకు చేరుకొని జంపన్నవాగు ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంపన్నవాగు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ ఐరన్‌బ్రిడ్జి పనులు వరద ఉధృతికి కొనసాగడం లేదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జంపన్నవాగుపై అగ్నిమాపక కేంద్రానికి సంబంధించిన బోటుతో పాటు మరొకటి ప్రజలకు అందుబాటులో ఉంచామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజల కోసం ఐటీడీఏలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలను చేపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీవో కుమార్, ఏవో వేణుగోపాల్ తదితరులున్నారు.

ఐటీడీఏలో కంట్రోల్‌రూం ఏర్పాటు

ఏటూరునాగారం రూరల్, జూలై 19 : ఏజెన్సీ మండలాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాలు, వరదలపై ప్రజలకు అందుబాటులో ఉండేందుకు మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం కంట్రోల్ రూంతో పాటు 6309842395, 08717-293246 నంబర్లను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ టిఎస్.దివాకర తెలిపారు. కంట్రోల్ రూంలో అధికారులు 24 గంటలు అధికారులు అందుబాటులో ఉంటారని, వర్షాలు, వరదల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లయితే కంట్రోల్ రూంనకు ఫిర్యాదు చేయాలని బాధితులకు కలెక్టర్ సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు కంట్రోల్ రూం అధికారులకు అందచేస్తారని, సమస్యలు పరిష్కరించేందుకు వీలుంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

కుమార్తెకు భూమి ఇవ్వనీయడం లేదని..

- కొడుకుని హత్య చేయించిన తండ్రి
- ముగ్గురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సంపత్‌రావు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 19 : కుమార్తెకు 20 గుంటల భూమి ఇవ్వకుండా అడ్డపడి నిత్యం తమను కొట్టిన కుమారుడిని తండ్రే హత్య చేయించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అందుకు సంబంధించిన వివరాలను భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత ఏప్రిల్ 23న భూపాలపల్లి మండలంలోని రాంపూర్ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియకుండా పెట్రోల్ పోసి కాల్చి చంపిన మృతదేహం లభ్యమైందన్నారు. ఈ మేరకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం ఎస్సై ప్రసాద్ నేతృత్వంలో 5ఇంక్లైన్ కమాన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం తురుకుల సోమవారం గ్రామానికి చెందిన బానోత్ బాలాజీ, ఇదే గ్రామానికి చెందిన బానోత్ సిద్దు, బానోత్ శ్రీను ఆటోలో పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. వర్ధన్నపేటలోని రందాన్‌తండాకు చెందిన గుగులోత్ ప్రభాకర్(29)ను పెళ్లి సంబంధం కోసమని చెప్పి భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం తీసుకెళ్తుండగా రాంపూర్ అటవీ ప్రాంతంలో మద్యం తాగించి తలపై బండరాయితో కొట్టి చంపి పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయినట్లు అంగీకరించారు. హత్య ఎందుకు చేశారని అడుగగా.. మృతుడి తండ్రి నరసింహస్వామినే కుమారుడిని చంపాలని రూ.50వేలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిపారు. ప్రభాకర్ తన చెల్లికి భూమి ఇవ్వకుండా అడ్డుపడుతూ తండ్రి రామస్వామి, తల్లిని కొడుతూ చంపుతామని బెదిరించేవాడని తెలిపారు. దీంతో కొడుకు వ్యవహార శైలితో విసుగు చెంది ఈ అఘాయిత్యానికి ఉసిగొలిపినట్లు నిందితులు స్పష్టం చేశారు.

దీంతో నేరాన్ని ఒప్పుకున్న దృష్ట్యా బానోత్ బాలాజీ, బానోత్ సిద్దు, బానోత్ శ్రీనులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. మృతుడి తండ్రి రామస్వామి పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై స్పందించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 19: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం భూపాలపల్లి కలెక్టరేట్‌లో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో అధికారులు సత్వరమే స్పందించి బాధితులకు అండగా నిలవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై అవాంఛనీయ సంఘటనలు జరిగితే చట్టప్రకారం వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. బాధితులకు అండగా నిలువడంతో పాటు వారికి మనోధైర్యం కల్పించాలన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులపై వెంటనే చార్జిషీట్ ఫైల్‌చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీవో మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడిన కలెక్టర్ వర్షాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పాత ఇళ్లలో ప్రజలు ఉండకుండా చూడాలన్నారు. వాగులు, వంకలు, కల్వర్టుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. మంచినీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ముమ్మరంగా డ్రైడేను నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యసేవలకు 7893323750 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బదిలీలు రద్దు చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

బల్దియా కార్మికులకు బదిలీల గండం

75ఏళ్లలో ఎప్పుడూ చేయలేదని ఆవేదన

నేడు సీఎంను కలువనున్న యూనియన్ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 19: బల్దియా పారిశుధ్య కార్మికులకు బదిలీల టెన్షన్ పట్టుకుంది. గురువారం 445 మంది కిందిస్థాయి ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో చాలామంది అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా, మరికొందరు ఏకంగా అంబులెన్స్‌లలో కౌన్సెలింగ్‌కు వచ్చిన పరిస్థితి ఉంది. ప్రధానంగా 30 కేటగిరీలలో పనిచేస్తున్న 445 మంది ఉద్యోగుల్లో ఎక్కువగా దళిత సామాజిక వర్గానికి చెందిన వారు ఉండడంతో ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే 75 యేళ్ల వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో నాలుగోతరగతి ఉద్యోగులకు ఎన్నడూ బదిలీలు జరగలేదని అంటున్నారు.

నేడు చలో హైదరాబాద్

గ్రేటర్ వరంగల్ పరిధిలో ఎన్నడూ లేని విధంగా నాలుగో తరగతి ఉద్యోగులను బదిలీ చేయడం సరైంది కాదని తెలంగాణ మునిసిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు ఇటీవల కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియంశ్రీహరిని కలిసి సమస్యలు వెల్లడించారు. వారు సైతం సానుకూలంగా స్పందించినా బదిలీల తంతు ఆగడం లేదు. దీంతో శనివారం ఉద్యోగ సంఘాలు, ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు హైదరాబాద్‌కు వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలువనున్నట్టు తెలిపారు. అంతేకాకుండా బదిలీల తీరుపై హైకోర్టును ఆశ్రయించి బదిలీల రద్దుకు పోరాటం చేస్తామని సంఘం నాయకులు బొట్ల బిక్షపతి మాదిగ, ధర్మరాజులు తెలిపారు.

విద్యుత్‌తో జాగ్రత్త

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌ఈలు మధుసూదన్‌రావు, వెంకటరమణ



హనుమకొండ టౌన్, జూలై 19: విద్యుత్ ప్రమాదాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని వరంగల్, హనుమకొండ ఎస్‌ఈలు మధుసూదన్‌రావు, వెంకటరమణ సూచించారు. గ్రామాల్లోని వినియోగదారులు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేసే లైన్‌మెన్, సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్, ఏఈల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రమాదాల నుంచి బయటపడాలంటే కింది జాగ్రత్తలను పాటించాలని వినియోగదారులకు సూచించారు.

- వ్యవసాయం నిమిత్తం రైతులు పంపుసెట్లను వినియోగిస్తున్నప్పుడు కరెంట్ మోటార్లు కానీ, పైపులు కానీ, ఫుల్‌వాల్వులను అశ్రద్ధతో తాకొద్దు. ఆ సమయాల్లో విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- వర్షాలు కురిసినప్పుడు విద్యుత్‌స్తంభాలను, తెగిపడిన తీగలను, స్టాటర్లను, మోటార్లను తాకొద్దు. వేలాడుతున్న కరెంట్ తీగల గురించి మీకు దగ్గర్లోని కరెంట్ ఆఫీస్, సంబంధిత అధికారులకు తెలియజేయాలి.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- సర్వీస్ వైర్లను వీధి దీపాలను సరిచేసేందుకు ఇతరులు విద్యుత్ స్తంభాలను ఎక్కొద్దు. విద్యుత్ సిబ్బంది సహాయం తప్పనిసరిగా తీసుకోవాలి.
- ఇంటి వరండాలో మరియు ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్ దగ్గరలో (జీఐ) వైరును దండెముగా కట్టి తడిబట్టలను ఆరవేయడం ప్రమాదకరం. ఎవరికైనా కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరగా ఉన్న వ్యక్తులు షాక్ గురైన వ్యక్తులను రక్షించాలన్న ఆతృతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ముట్టుకోరాదు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని వస్తువులను వాడటమే సరైన పరిష్కారం.
- చేపల వేటకు విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన షాక్‌కు గురై చనిపోతున్నారు. చేపలు పట్టడానికి విద్యుత్ తీగలు వాడరాదు.
- బోరు వేస్తున్నప్పుడు విద్యుత్ వైర్లు తాకి కొంతమంది చనిపోతున్నారు. బోర్లు వేస్తున్నప్పుడు పైన విద్యుత్ వైర్లు ఉన్నాయా లేదా అని ఒక సారి చూసుకొని జాగ్రత్తగా బోర్లు వేసుకోవాలి.
- జెండాలు ఎగుర వేస్తున్నప్పుడు జెండా పైపులు పైన విద్యుత్ వైర్‌కు తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వరికోతల సమయంలో హార్వెస్టర్స్‌కు విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడటంతో షాక్‌కు గురై చనిపోతున్నారు. చార్జింగ్ బంద్ చేసి మాట్లాడాలి.
- జంతువుల నుంచి పంట రక్షణ కోసం విద్యుత్ ఫెన్సింగ్ వేస్తున్నారు. ఇది చట్టరిత్యా నేరం. విద్యుత్ కంచెలు వేయరాదు.

కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి..

ప్రొఫెసర్ కంచ ఐలయ్య



సదస్సులో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

కాళోజీ జంక్షన్, జూలై 19: హనుమకొండ బాలసముద్రంలోని కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలని అక్కడే గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హరిత కాకతీయ హోటల్‌లో 'తెలంగాణ ఉద్యమం - గద్దర్ పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సుకు డీఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ అధ్యక్షత వహించారు. కళాక్షేత్రం ప్రారంభం కాకముందే పేరు పెట్టడం సరైంది కాదని ఆయన అన్నారు. గద్దర్ అంటే కేవలం ఒక ప్రాంతానికి, వర్గానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరి మనిషి అని ఐలయ్య అన్నారు. కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టకుంటే, విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వకపోతే ఉద్యమాలు చేసి సాధించుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర సాహిత్య యువ పురస్కార్ అవార్డు గ్రహీత పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ విషయంపై పట్టించుకోకుంటే పోరాడి సాధించుకుంటామని తెలిపారు. సమావేశంలో ఇంకా టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్, టీజీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్, బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కాడపాక రాజేందర్, పలు విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు.

రేపు నేత్ర, అవయవ, శరీరదాన ఐక్య వేదిక సమావేశం

కాళోజీ జంక్షన్, జూలై 19: నేత్ర, అవయవ, శరీరదాన రాష్ట్ర ఐక్య వేదిక సమావేశం ఆదివారం హనుమకొండలోని గోపాల్‌పూర్ జంక్షన్ సమీపంలోని అభి నిలయంలో నిర్వహిస్తున్నట్లు ఐక్య వేదిక వరంగల్ జిల్లా డైరెక్టర్ కొన్‌రెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ గంజి ఈశ్వరలింగం, కో కన్వీనర్ రాంకల్యాణ్, ప్రముఖ డాక్టర్ దాసరి ప్రసాదరావు, పలు సేవా కార్యక్రమాల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నేత్ర, అవయవ, శరీరదాన ప్రాముఖ్యతను, భావజాలాన్ని వ్యాప్తి చేయడం సమావేశ ఉద్దేశమని మల్లారెడ్డి వివరించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు. సమావేశ వివరాల కోసం సెల్ నంబర్లు: 87905 48706 / 97037 38699 లను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీ డ్రైవర్ ఆత్మహత్య



మర్కండి వేణు (ఫైల్)

మట్టెవాడ, జూలై 19: ఆర్థిక ఇబ్బందులు తాళలేక లారీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన హంటర్ రోడ్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో జరిగింది. మట్టెవాడ సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం. నగరంలోని హంటర్‌రోడ్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మర్కండి వేణు (54) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు పని నిమిత్తం బయటికి వెళ్లిన వేణు భార్య స్వరూపకు సమాచారం అందించారు. ఆమె వచ్చిన వెంటనే ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వేణుకు భార్య స్వరూప, కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దామెర, జూలై 19 : దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన బిల్లా సురేందర్ రెడ్డి, బిల్లా దివ్యలు ద్విచక్రవాహనంపై హనుమకొండ కు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒగ్లాపూర్ స్టేజి వద్ద ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ప్రమాదవ శాత్తు కిందపడిపోయారు. దీంతో తీవ్రగాయాలైన క్షతగాత్రులను 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

చదరంగ వీరులు

- చెస్‌లో రాణిస్తున్న ఓరుగల్లు ఆణిముత్యాలు
- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న అర్జున్, రాజారిత్విక్, సరయు



నేడు అంతర్జాతీయ చదరంగ దినోత్సవం

వరంగల్ స్పోర్ట్స్, జూలై 19: చదరంగం అంటేనే ప్రత్యర్థి కదలికను గమనిస్తూ ఎత్తుకు పైఎత్తు వేస్తూ వ్యూహాత్మకంగా ఆలోచిస్తూ చిత్తు చేయడం. అంతేకాకుండా ప్రత్యర్థి ఆలోచనల్ని విభిన్న కోణాల నుంచి పసికడుతూ విజయం వైపు దూసుకెళ్లాల్సి ఉంటుంది. మైండ్‌గేమ్‌గా ప్రాచుర్యం పొందిన చెస్‌లో రాణించాలంటే చిన్నతనం నుంచి ఆట పట్ల ఆసక్తి, ఏకగ్రాత, క్రమశిక్షణ, నిబద్ధత తప్పనిసరిగా ఉంటేనే సాధ్యమవుతుంది. 1966 జూలై 20న యునెస్కో ఆలోచన మేరకు ఫిడే ఆదేశాలతో తొలిసారిగా అంతర్జాతీయ చదరంగం (చెస్) దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. దీంతో యేటా భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలలో చదరంగ దినోత్సవ వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఈ మేరకు శనివారం అంతర్జాతీయ చదరంగం (చెస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలువురు చెస్ దిగ్గజాలు, గ్రాండ్ మాస్టర్లు, (జీఎం)లు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.

జిల్లా కుసుమాలు

ప్రపంచ స్థాయిలో ఆదరణ పొందిన చెస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడకారులు సత్తా చాటుతున్నారు. అర్జున్, రాజరిత్విక్, సరయులు అంతర్జాతీయ చెస్‌లో రాణిస్తూ వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చిన్న వయస్సులోనే గ్రాండ్ మాస్టర్లుగా అర్హత సాధించి రాష్ట్రానికి, జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తున్నారు. హనుమకొండ నగరానికి చెందిన ఇరిగేసి అర్జున్ 15 ఏళ్లకే క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్‌లో రాష్ట్రం నుంచి తొలి గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదాను సాధిం చాడు. ప్రపంచస్థాయి క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్ లో 4వ స్థానంలో నిలవగా, భారతదేశం నుంచి క్లాసికల్ ఫిడే రేటింగ్‌లో తొలి స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించాడు. అదే విధంగా నగరానికి చెం దిన మరో అంతర్జాతీయ చెస్ దిగ్గజం రాజావరం రాజారిత్విక్.. తన తండ్రి స్వతహాగా చెస్ క్రీడాకా రుడు కావడంతో 6ఏళ్ల వయస్సులో కోచ్ బొళ్లం సంపత్‌కుమార్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్‌లో 17ఏళ్ల వయస్సులోనే తెలంగాణ నుంచి రెండో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. అలాగే మొండ్రాయి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సరయు చిన్నతనంలోనే చెస్ క్రీడ పట్ల ఆసక్తి పెంచుకుంది. ఇది గమనించిన తండ్రి చెస్‌లో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించుకున్నాడు. కోచ్ బొళ్లం సంపత్ వద్ద శిక్షణ తీసుకుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చెస్‌పోటీల్లో పాల్గొని ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదాను అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. పేద కుటుంబంలో జన్మించిన సరయు ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా ఐఎం హోదాను సాధించి 3 నార్మ్‌లు చెస్‌లో పాల్గొని అత్యధిక ఫిడ్ చెస్ రేటింగ్ సాధించి గ్రాండ్ మాస్టర్ హోదా సాధించే అవకాశం దగ్గరలోని ఉంది.

క్రీడాకారులను ప్రోత్సహించాలి..

చెస్ క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోతున్నారని సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెస్ మేధావులను ప్రభుత్వం గుర్తించి ఆదరిస్తే మరెన్నో అద్భుతాలను సృష్టించే అవకాశం ఉందంటున్నారు. చదరంగంలో రాణించాలంటే క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఆదరిస్తే మరికొంత మంది క్రీడాకుసుమాలు అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉందంటున్నారు.

చాంపియన్‌షిప్ సాధించడమే లక్ష్యం

ఇరిగేసి అర్జున్, చెస్ గ్రాండ్ మాస్టర్ హనుమకొండ



25వ అబుదాబీ చెస్ ఫెస్టివల్, మాస్టర్స్ టోర్నమెంట్‌లో మూడో నార్మ్‌లో విజయం సాధించి గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల పర్యవేక్షణతోనే జీఎం హోదాను సాధించాను. ఫిడే రేటింగ్‌లో ప్రపంచ చాంపియన్‌గా ఉన్న మాగ్నస్ కార్ల్‌సన్ పై విజయం సాధించి ప్రపంచ చెస్ చాంపియన్ సాధించడమే నా లక్ష్యం.

సూపర్ గ్రాండ్ మాస్టర్ సాధిస్తా..

రాజావరం రాజారిత్విక్, చెస్ గ్రాండ్ మాస్టర్



మైండ్ గేమ్ అయిన చెస్ రాణించాలంటే ఏకాగ్రత తప్పనిసరి, 17ఏళ్ల వయస్సులో రాష్ట్రం నుంచి రెండో చెస్ గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించాను. సూపర్ గ్రాండ్ మాస్టర్‌గా నార్మ్స్ సాధించి ఫిడే చెస్ రేటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభతో రాణించి ప్రపంచ చెస్ చాంపియన్‌గా విజయం సాధిస్తానని నమ్మకం ఉంది.

గ్రాండ్ మాస్టర్ సాధించడమే కర్తవ్యం

సరయు, చెస్ ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం)



జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చెస్ ట్రోర్నమెంట్లలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాణించి ఫిడే చెస్ రేటింగ్ ఆధారంగా వివిధ హోదాలు అందిపుచ్చుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే క్యాండిడేట్ మాస్టర్ (సీఎం) ఫిడే మాస్టర్ (ఎఫ్ఎం) ఇంటర్నేషినల్ మాస్టర్ (ఐఎం) హోదాను సాధించాను. దీంతో పాటుగా మూడు నార్మ్‌లు వివిధ దేశాల ప్రత్యర్థులతో పాల్గొని ఫిడే చెస్ రేటింగ్ సాధించి గ్రాండ్ మాస్టర్‌గా రాణించాలనేదే నా కర్తవ్యం.

ఇద్దరు గ్రాండ్ మాస్టర్లుగా ఎదగడం గర్వకారణం

బాసిరి వెంకట రాజ్‌గోపాల్, వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు



ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన ఇరిగేసి అర్జున్, రాజవరం రాజారిత్విక్‌లు చిన్న వయస్సులోనే చెస్‌లో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం గర్వకారణం. చిన్నప్పటి నుంచి చెస్ క్రీడ పట్ల పట్టుదలతో సాధనం చేయడం ద్వారానే వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 19: గంజాయిలాంటి మత్తు పదార్థాల నియంత్రణకు వరంగల్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అంబర్ కిషోర్ ఝా మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకు డ్రగ్ కంట్రోల్ టీంను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీం కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల విక్రయాలపై, మత్తుపదార్థాలు సేవించే వారిపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక పోలీసులతో కలిసి ప్రత్యేక టీం పనిచేస్తుందన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. డ్రగ్స్ కిట్‌లతో నిరంతరం రోడ్లపై తనిఖీలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో డీ ఎడిక్షన్ సెంటర్ సైతం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కమిషనరేట్ పరిధిలో పూర్తి స్థాయిలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు వెలుతున్నట్లు అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

కౌన్సెలింగ్‌కు వెళ్లిన నర్సింగ్ ఆఫీసర్లు

ఎంజీఎంలో ఇబ్బందులు పడుతున్న రోగులు

వరంగల్ మెడికల్, జూలై 19: రాష్ట్ర ఆరోగ్యశాఖ సంచాలకుల కార్యాలయ నిర్లక్ష్యం వల్ల నర్సింగ్ ఆఫీసర్ల కౌన్సెలింగ్ రసాభాసగా మారింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పడంతో ఎంజీఎం నుంచి 200లకు పైగా నర్సింగ్ ఆఫీసర్లు గురువారం రాత్రి నుంచే సెలవులు పెట్టి హైదరాబాద్‌కు వెళ్లారు. తీరా అక్కడకు వెళ్లాకా మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ అని ప్రకటించారు. అప్పటికే తప్పుల తడకగా ఉన్న లిస్టుతో కౌన్సెలింగ్ చేసేందుకు అధికారులు ప్రయత్నించగా నర్సింగ్ ఆఫీసర్లు అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ ముందు వేకెన్సీ లిస్టును, స్పౌజ్, వికలాంగులు తదితర ప్రాధాన్యక్రమంకు సంబంధించిన జాబితాలు ప్రకటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌన్సెలింగ్‌కు అడ్డుతగిలారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు కూడా కౌన్సెలింగ్ జరుగుతుందా లేదా అనే అయోమయంలో ఉన్నారు. దీంతో ఎంజీఎంలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థులతో సేవలను అధికారులు నెట్టుకు వస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఎంజీఎం రోగులకు శాపంగా మారింది.

వంగపహాడ్‌లో త్వరలో పోలీసు ఔట్‌పోస్ట్

అడ్డుకునేందుకు కొందరి ప్రయత్నాలు

వరంగల్ క్రైం, జూలై 19: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్ గ్రామ ప్రారంభంలో పోలీసు ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఈ ప్రాంతంలో 2010 నుంచి 2015 వరకు ఔట్‌పోస్ట్ ఉండేది. తర్వాత ఔట్‌పోస్ట్ ఎత్తేశారు. ఓఆర్‌ఆర్‌పై అసాంఘిక కార్యకలాపాలు సాగుతుండటం, మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమదందాలు సాగుతుండటంతో ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలనే ఆలోచన పోలీసులు చేస్తున్నట్లు సమాచారం. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం సాగుతుండటంతో దందాలు చేసేవారు స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయకుండా ముందస్తు ప్రయత్నాలు సాగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తే దందాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో పోలీసులతో బేరసారాలు చేస్తున్నారని తెలిసింది. కొందరు పోలీసులు సైతం ఒక బేరం కుదుర్చుకుని ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయకుండా చూస్తామని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఔట్‌పోస్ట్ ఏర్పాటుపై కాజీపేట ఏసీపీని వివరణ కోరే ప్రయత్నం చేయగా స్పందించలేదు.

26 నుంచి కేయూ బీటెక్ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూలై 19: కాకతీయ యూనివర్సిటీ జూలై 26 నుంచి ఇంజనీరింగ్ (బిటెక్) రెండో, మూడో సెమిస్టర్ నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహ చారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బి.నాగరాజు శుక్రవారం ప్రకటించారు. జూలై 26, 30, ఆగస్టు 1, 3, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెండు, మూడో సెమిస్టర్లకు చెందిన రెగ్యులర్, సప్లిమెంటరీ, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని కోఎడ్యుకేషన్, మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల, మంచి ర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వడ్డెపల్లి, జూలై 19: ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్ల నిధులను కేటాయించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమ్మడిశెట్టి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది ఆటోడ్రైవర్లు ఉన్నారని, వీరి సంక్షేమం కోసం ఆటో డ్రైవర్ బీమా పథకాన్ని రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పినప్పటికీ ఏడునెలలు కావొస్తున్నా కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఆటోడ్రైవర్ల ఆదాయానికి గండి పడిందని పేర్కొన్నారు. వేలాది మంది ఆటోడ్రైవర్లు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.25వేలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం బాలసముద్రంలోని ఏకశిల పార్కులో నిర్వహించే ధర్నాలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇమ్మడిశెట్టి రాజు కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ నేతలు గౌని రాజు, ఆవుల నవీన్‌కుమార్, మస్కే కరుణాకర్, అక్కనపెల్లి అంజయ్య, గోపనబోయిన రాజు, బరిగెల కృష్ణమూర్తి, ఆమంచ ప్రశాంత్, బండారి శ్రీకాంత్, ఆకుల వెంకటేష్, పత్తి నర్సయ్య, తాళ్ల అంజి, వస్కుల రాజ్‌కుమార్, గడ్డం కిరణ్, తప్పెట పరశురాములు, కొట్టె జోసఫ్ పాల్గొన్నారు.

పనితీరును మెరుగుపరుచుకోవాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి



హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న సీఎండీ

హనుమకొండ టౌన్, జూలై 19: పనితీరును మరింత మెరుగుపరుచుకొని వినియోగదారులకు అంతరాయాల్లేని విద్యుత్ సరఫరాను అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి సూచించారు. డిస్కమ్ పరిధిలో ఉద్యోగుల ప్రతిభ ఆధారంగా నెలవారీగా అందించే జ్ఞాపికలు, ప్రశంసాపత్రాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన మేనెల జ్ఞాపికలను సీఎండీ ఉద్యోగులకు అందజేశారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రశంసలు అందుకున్న ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని ఇతర ఉద్యోగులు విధి నిర్వహణలో రాణించాలన్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న ఇంజనీర్లకు ఈ సందర్భంగా సీఎండీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో డిస్కమ్ పరిధిలో హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, ఉమ్మడి వరంగల్ ఏడీఈ విభాగంలో హనుమకొండ టౌన్ ఏడీఈ మల్లిఖార్జున్, ఏఈ విభాగంలో యం.ప్రవీణ్ - నక్కలగుట్ట, ఏఈ రమేశ్ - దామెర, నవీన్‌కుమార్ - సుబేదారి, బి.పద్మ - హనుమకొండ రూరల్ డివిజన్, ఐనవోలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ టి.మధుసూదన్, సీజీఎం కిషన్, హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, హనుమకొండ రూరల్ డివిజన్ డీఈ బి. సామ్యానాయక్, ఏడీఈ పరకాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భరత్ ఉద్యమ స్ఫూర్తితో అనేక పోరాటాలు

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క ● ఎంచగూడెంలో సంస్మరణ సభ



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న విమలక్క భరత్ కుటుంబసభ్యులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జూలై 19 : జనశక్తి నేత భరత్ తన ఉద్యమంలో చూపిన తెగువతోనే గోదావరిలోయ విప్లవోద్యమంలో అనేక పోరాటాలు జరిగాయని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంలో జనశక్తి నేత భరత్ 24వ సంస్మరణ సభను భరత్ కుమారులు కృష్ణ, శ్రీను, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు శుక్రవారం నిర్వహిం చారు. ముందుగా భరత్ కుమారులు, కుటుంబసభ్యులు, అభిమానులతో కలిసి భరత్ స్తూపం వద్ద నివాళులు విమలక్క అర్పించారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడుతూ తాను అజ్ఞాతంలో పనిచేయలేదని కాని విప్లవాన్ని, అమరత్వాన్ని తన పాటలతో ప్రజల్లోకి తీసుకెళ్లానని పేర్కొన్నారు. విప్లవోద్యమ చరిత్రలో భరత్ పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. నేడు విప్లవోద్యం చీలికలై బలహీనపడుతుందన్నారు. ఉద్యమాలకు తీరని నష్టం జరుగుతుందని ఆవేదన చేందారు. విప్లవకారులు, ప్రజలు బాధపడుతున్నారన్నారు. చీలికలను ఆసరగా చేసుకుని పెట్టుబడి దారులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. పలువురు ఉద్యమకారులు భరత్‌తో ఉన్న తమ అనుభవాలను, నాటి పోరాటలను గుర్తు తెచ్చుకున్నారు. కాగా, విమలక్క, పుష్పక్క, యోచన పాడిన పాటలు ఉత్తేజపరిచాయి, మరికొన్ని కన్నీళ్లు పెట్టించాయి. సభలో మంత్రి సీతక్క కుమారుడు సూర్య, మాజీ జనశక్తి రాజన్న, విష్ణుమూర్తి, జగ్గన్న, సత్తెన్న, రవీందర్, విజయక్క, నాగన్న, ఎన్డీ నాయకులు గౌని అయిలయ్య, శ్రీశైలం, భరత్ బంధువులు బండి పెద్దకుమార్, బండి కుమారస్వామి, జిట్టబోయిన యాకయ్య, సుంకరబోయిన మొగిలి, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఆర్డీఎస్డీఈ ట్రైనింగ్ ఆఫీసర్ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఎస్‌టీఈ ఆఫీసర్ విజయ్‌కుమార్

కేయూ క్యాంపస్, జూలై 19: వృత్తి విద్యా కోర్సులు చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని హైదరాబాద్‌లోని రీజికల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఇంటప్రెన్యూర్‌షిప్ ఆఫీసర్ కె.విజయ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం హనుమకొండ వృత్తి విద్యా కళాశాలల ఆవరణలో విద్యార్థులకు అప్రెంటిషిష్ మేళా-2024 నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బెడదం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఇంటర్ ఒకేషనల్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కేంద్ర టెక్నికల్ సంస్థ శిక్షణ సంస్థ ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.7వేలు ఉపకార వేతనంగా శిక్షణ సమయంలో చెల్లిస్తుందని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ రీడర్ బి.రమేశ్ మాట్లాడుతూ.. అభ్యర్థులు ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ), జాబ్‌మేళా కన్వీనర్ ఎ.గోపాల్ మాట్లాడుతూ.. ఇంటర్ స్థాయిలో ఇలాంటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒకేషనల్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్రెంటిషిష్ మేళా కోకన్వీనర్ కె. మాధవరావు, జనగామ నోడల్ ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శాగంటి శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ పి.దివాకర్, డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, జాబ్‌మేళాకు అభ్యర్థులు విశేషంగా హాజరయ్యారు. రిజిస్ట్రేషన్లు చేసుకుని ఉద్యోగాలు పొందారు.





ఘటన స్థలంలో భవాని, దినేష్

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు, జూలై 19: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో వివాహిత మృతిచెందగా, భర్త, కుమారుడు తీవ్రగాయాల పాలైన సంఘటన శుక్రవారం మండలంలోని గూడెప్పాడ్ క్రాస్‌వద్ద జరిగింది. లారీ శరీరం మీది నుంచి పోవడంతో ఛిద్రమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెప్పాడ్‌కు చెందిన బలభద్ర దినేష్ - భవాని(23) దంపతులకు కుమారుడు ప్రద్యుమన్ ఉన్నారు. వీరు వరంగల్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్‌కు వెళ్లిన వీరు.. మధ్యాహ్నం వరంగల్ నుంచి గూడెప్పాడ్‌కు కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి పరకాలకు వస్తున్న లారీ.. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ క్రాస్ వద్ద ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న భవాని, దినేష్‌తో పాటు రెండేళ్ల బాలుడు ఎగిరి పడ్డారు. భవానిపై లారీ ముందు టైరు వెళ్లడంతో పొట్టపగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఆత్మకూరు సీఐ సంతోష్ కుమార్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ భవాని మృతి చెందినట్లు సీఐ తెలిపారు. భర్త దినేష్, కుమారుడు ప్రద్యుమన్‌లు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



వానమబ్బుల వేళ.. పుడమి పచ్చందాల కళ..

ఓ వైపు వానమబ్బులు.. మరోవైపు పచ్చని అందాలను పరుచుకున్న పుడమి. ఆ అపురూప దృశ్యాల కలయిక ఎంతో చూడముచ్చటగా ఉంటుంది కదూ. గుట్టల మాటు నుంచి పొగమంచు తెరల్లా కనిపిస్తున్న ఆ చిరుజల్లుల సవ్వడిలోనే రైతులు, కూలీలు పొలం పనుల్లో నిమగ్నమైన దృశ్యాలు కనులవిందు చేశాయి. ఈ ప్రకృతి రమణీయ దృశ్యం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్ తండా వద్ద శుక్రవారం కనిపించింది.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

భారీ వర్షాలతో అతలాకుతలం


దొడ్డ- మల్యాల మధ్య జంపన్నవాగుపై ఏర్పాటు చేసిన పడవ


గుట్టల గంగారంలో నిలిపేసిన దేవాదుల ఎత్తిపోతల మోటార్లు


మల్హర్ వద్ద మానేరు వరద ప్రవాహం


మహాముత్తారం మండలం కేశాపూర్ పెగడపల్లి గ్రామాల మధ్య పెద్దవాగు లోలెవెల్ కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


కాటారం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బొర్రవాగు

- పత్తి, వరి పొలాలు నీట మునక
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- గోదావరిలో పెరిగిన ప్రవాహం
- లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీర
- విరిగిన స్తంభాలు, కూలిన ఇళ్లు
- అలుగువాగులో కొట్టుకుపోయిన వాహనం, చెట్టెక్కి డ్రైవర్ సురక్షితం
- కాటారం మండలంలో రికార్డు స్థాయిలో 141.8మి.మీ వర్షపాతం

కాటారం, జూలై 19: జిల్లాలో భారీ వర్షాలతో జనజీవనం అతలాకుతలమైంది. వాగులు.. వంకలు ఉప్పొంగగా, గోదావరిలో వరద నీటి ప్రవాహం పెరిగింది. మానేరు నది సైతం ఉధృతంగా ప్రవహించింది. కాటారం మండలంలో ఆకాశానికి చిల్లు పడిందన్నట్లుగా ఏకధాటిగా వర్షం కురిసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు అతి భారీవర్షంతో అంతా జలప్రళయమై అతలాకుతలం చేసింది. 8గంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో 141.8మి.మీ వర్షపాతం నమోదు కావడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. శంకరంపల్లి జీపీ పరిధిలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ, లోపల వరదనీరు భారీగా చేరింది. బుడగజంగాల కాలనీలో రేవెళ్లి సమ్మయ్య, గంధం రమేష్ ఇళ్లలోకి వరద నీరు చేరి వస్తువులు తడిసి నష్టం వాటిల్లింది. గుమ్మళ్లపల్లిలో కుడిమేత సమ్మక్క అనే వృద్ధురాలి ఇల్లు కుప్పకూలింది. సమ్మక్క రేకులషెడ్డులో ఉండటంతో ప్రమాదం తప్పింది. గోపాల్‌పూర్‌వాగు, మల్లారం పెద్ద వాగు, ఒడిపిలవంచ బండలవాగులు ఉప్పొంగడంతో సుమారు 150 ఎకరాలకు పైగా పత్తి చేలు, వరి పొలాలు వరద నీటిలో మునిగిపోయాయి. పలువురు రైతులు తమ పంటలకు జరిగిన నష్టం చూపుతూ ఆవేదన చెందారు. పలు చోట్ల పంట పొలాల్లోకి వరద నీరు చేరి రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. లోతట్టు ప్రాంతాలన్నీ వరద నీటితో జలమయమయ్యాయి. జాదరావుపేట శివారులోని బ్రిడ్జి సమీపంలో వరదనీటితో తారురోడ్డు కోతకు గురై రోడ్డు కుంగిపోవడంతో ప్రమాదకరంగా మారి బస్సులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గంగారంలో చెట్టు కూలి విద్యుత్ స్తంభం విరిగి తీగలు తెగిపడ్డాయి. దీంతో ప్రజలు చీకట్లోనే మగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. మానేరు నది నురగలు కక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నది. మరో రెండు రోజులు భారీ వర్షాలుండటంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి తహసీల్దార్‌నాగరాజు, ఎంపీడీవో బాబు, ఆర్‌ఐ వెంకన్నలు ఏర్పాట్లు చేశారు. పొంగుతున్న వాగులవద్ద పరిస్థితిని పరిశీలించారు. తగిన ఏర్పాట్లు చేయాలనిపంచాయతీ,రెవెన్యూ,పోలీసుసిబ్బందికి సూచించారు.

గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, ఒడిపిలవంచ బండల వాగు, మల్లారం మిడిచెరువు అలుగువాగులు పొంగి పొర్లడంతో శుక్రవారం ఉదయం రాకపోకలు నిలిచిపోయాయి. మల్లారం మిడిచెరువు అలుగువాగు ఉధృతంగా ప్రవహిస్తుండగానే గురువారం రాత్రి మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఎల్లక్కపేటకు చెందిన పస్తం రమేష్ బొలేరో ట్రాలీ ఆటోను దాటించే ప్రయత్నం చేయగా వాగులో కొట్టుకుపోయి ఆటోలో ముందుభాగం బురదలో కూరుకుపోయి చెట్టుకు తట్టుకుని ఆగిపోయింది. రమేష్ అక్కడే ఉన్న చెట్టు పైకి ఎక్కి ఉండగా ఉదయం దామెరకుంటకు చెందిన హోంగార్డు రాజయ్య, పొలాల వైపు వెళ్లిన రైతులు గమనించి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. శుక్రవారం పోలీసులు బొలేరో ట్రాలీని బయటికి తీయించారు. అతి భారీ వర్షంతో అలుగువాగు, బొర్రవాగులు ఉధృతంగా ప్రవహించడంతో కొన్ని గంటల పాటు వాహనాలు దాటని పరిస్థితి నెలకొంది. ప్రమాదకరంగా పొంగుతున్న వాగుల నుంచి ఎవరూ దాటకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అతి భారీ వర్షంతో పంటలు, ఆస్తులు నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

- మహదేవపూర్ : మహదేవపూర్ మండలంలో భారీ వర్షాలతో వాగులు పొంగి పొర్లుతున్నాయి. అతిపెద్ద పెద్దపేట వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అనేక వాగులపై బ్రిడ్జిలు ఉండడంతో మండలంలో రాకపోకలు సాగుతున్నాయి. చిన్నచిన్న వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అన్నారం సమీపంలోని చంద్రుపల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇసుక లారీలు రోడ్లను ధ్వంసం చేయడంతో కుంట్లం నుంచి కాళేశ్వరం వరకు రోడ్డు పూర్తిగా బురదమయమైంది. నాట్ల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట లభించింది.

పెరుగుతున్న గోదావరి

మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర, ముక్తీశ్వర త్రివేణి సంగమ గోదావరి, ప్రాణహిత గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భారీ వర్షాలకు కాళేశ్వరం వద్ద రెండు నదులు పరుగులు తీయడంతో పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమక్రమేణా జరుగుతోంది. సరస్వతి బ్యారేజీ వద్ద గేట్లు తీయడంతో వరద నీరు ఎక్కువ రావడంతో గోదావరి పెరుగుతోంది. ఇటు మానేరువాగు, వంకల నుంచి పెద్ద ఎత్తున గోదావరిలోకి పెద్ద ఎత్తున వరద చేరుతోంది. దీంతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలో కాళేశ్వరం నుంచి అన్నారం-చందుపల్లి వెళ్లే వాగు ఉప్పొంగడంతో రవాణా పూర్తిగా స్తంభించింది. మహదేవపూర్-కాళేశ్వరం వెళ్లే రహదారిలో కల్వర్టులు ఉప్పొంగడంతో వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాళేశ్వరం వద్ద గోదావరి 6 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద నుంచి సుమారు 60వేల క్యూసెక్కుల నీళ్ల మొత్తం 85 గేట్లు ఎత్తి ఉంచడంతో గోదావరి నది సాధారణంగా ప్రవహిస్తోంది. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మాదురి నర్సమ్మ ఇల్లు కూలడంతో కుటుంబం రోడ్డు పాలైంది. కుటుంబానికి పునరావాసం కల్పిస్తామని ఎస్సై, గ్రామ కార్యదర్శి, మండల రెవెన్యూ అధికారులు తెలిపారు.

- మల్హర్ : మండల వ్యాప్తంగా గురువారం రాత్రి వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పత్తి, వరి పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. మల్లారంలోని ఆరెవాగులో ప్రవాహం కొనసాగుతుంది. ఎగువన కురిసిన వర్షం వల్ల మానేరులో వరద ప్రవాహం పెరిగింది. మండల వ్యాప్తంగా 89మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.
- మహాముత్తారం : మండలంలోని గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ సంవత్సరం వర్షాకాలం మొదలైనప్పటి నుంచి భారీ వర్షం కురవకపోవడంతో చెరువులు, కుంటలు నిండలేదు. దీంతో రైతులు వ్యవసాయ పనులు మొదలు పెట్టడానికి వెనుకాడారు. భారీ వర్షంతో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకొన్నాయి. కాటారం-మేడారం రహదారిలో కేశాపూర్ పెగడపల్లి మధ్య పెద్దవాగు లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో శుక్రవారం మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయి.
- ఏటూరునాగారం రూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు తుపాకులగూడెం వద్ద గల శ్రీసమ్మక్క- సారలమ్మ బ్యారేజీ వద్ద గేట్లను ఎత్తివేయడంతో మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమంగా పెరుగుతుంది. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద శుక్రవారం ఉదయం 8 గంటలకు 10.180 మీటర్ల నీటిమట్టం ఉండగా మధ్యాహ్నం 1 గంటకు 11.190 నీటిమట్టానికి చేరుకుంది. క్రమంగా గోదావరి పెరుగుతూ సాయంత్రం 5 గంటలకు 11.630 మీటర్లకు చేరుకుంది. గోదావరి వరద ఉధృతి పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతితో పాటు కరకట్ట పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మండలంలో జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జంపన్నవాగు పరివాహక ప్రాంతాల్లో ప్రజలు రాకపోకలు సాగించేలా అధికారులు వాగుపై మూడు పడవలను ఏర్పాటు చేశారు. కొండాయి, మల్యాల, గోవిందరాజులకాలనీ, ఐలాపురం తదితర గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. బానాజీబంధం-ఎలిశెట్టిపల్లి గ్రామాల మధ్య గల జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎలిశెట్టిపల్లి వాసులకు బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. ఈ నేపథ్యంలో ఎలిశెట్టిపల్లి వాసులకు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పడవను ఏర్పాటు చేశారు.

దేవాదుల పంపింగ్ బంద్

కన్నాయిగూడెం : మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్‌ను శుక్రవారం సాయంత్రం నిలిపివేశారు. శుక్రవారం ఉదయం వరకు నీటిని పంపింగ్ చేసిన అధికారులు గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రిజార్వాయర్లలోకి వర్షపు నీళ్లు చేరుతుండటంతో పంపింగ్‌ను నిలిపివేశారు. తుపాకుగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. శుక్రవారం ఉదయం పెరుగుతూ వచ్చిన గోదావరి సాయంత్రం వరకు తగ్గింది. ఉదయం 9 గంటలకు 3,82,057 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా మధ్యాహ్నం 12 గంటలకు 3,93,700 క్యూసెక్కులుగా నమోదైంది. బ్యారేజీలోని అన్ని గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. దేవాదుల వద్ద 79.10 మీటర్లు, బ్యారేజీ వద్ద 78.50 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

- మంగపేట : మండలంలో భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు, ఒర్రెలు పొంగిపొర్లుతున్నాయి. దీనికి తోడు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలన జలాశయాలు, బ్యారేజీల నుంచి నీటిని విడుదల చేయడంతో వరద ప్రవాహం బాగా పెరుగుతుంది. ఈక్రమంలో మండలంలోని కమలాపురం బిల్ట్ ఇంటెక్వెల్, మంగపేటలోని పొద్మూరు శివారులో గల పుష్కరఘాట్ వద్ద గోదావరి వరద నెమ్మదిగా పెరుగుతూ వస్తుంది. శుక్రవారం సాయంత్రం వరకు బిల్ట్ ఇంటెక్వెల్ వద్ద సముద్ర మట్టానికి 7 మీటర్ల 50 సెంటిమీటర్ల వరకు వరద ప్రవాహం కన్పించింది. ఇంకా బాగానే పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. వరద ప్రవాహం వలన మంగపేట పుష్కరఘాట్ పూర్తిగా కొటుకొనిపోతూ వ్యవసాయ భూములు కోతకు గురవుతున్నాయి. దీంతో కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, చుంచుపల్లి, వాడగూడెం, పాలాయిగూడెం, దేవనగరం, కత్తిగూడెం, అకినేపల్లి-మల్లారం తదితర లోతట్టు ప్రాంతాలకు క్రమేపి చేరుతుంది. మంగపేట, బోరునర్సాపురం మధ్యలో గల గౌరారం వాగు సైతం పెరుగుతూ మంగపేటవైపు భూమి కోతకు గురవుతుంది. వరద నీరు ఇళ్లలోకి నెమ్మదిగా చేరుకుం టున్నాయి. దీంతో వడ్డెరకాలనీ, బానారివాడ, ముస్లిం వాడల ప్రజలు అప్రమత్తమవుతున్నారు. ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకొంటున్నారు.
- వాజేడు : ఎగువున కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వేగంగా పెరుగుతుంది. సమ్మక్క సాగర్ బ్యారే జీ నుంచి అన్ని గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుం డడంతో మండలంలో గోదావరికి వరద నీరు భారీగా చేరుకుంది. గురువారం రాత్రి 8గంటలకు 10.880 మీట ర్లు ఉన్న నీటిమట్టం శుక్రవారం ఉదయం 6గంటలకు 11.830 మీటర్లకు చేరుకుంది. మధ్యాహ్నం 12గంటలకు 12.740 మీటర్లు ఉన్న నీటిమట్టం సాయంత్రం 4గంటల కు 12.760 మీటర్ల చేరుకొని 5గంటలకు కాస్తంత తగ్గి 12.730 మీటర్ల నీటిమట్టంతో ప్రవహిస్తుందని సీడబ్ల్యూ సీ అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గురువా రం రాత్రి భారీ వర్షం కురవడంతో మండలంలోని రాం పురం, అయ్యవారిపేటలో పలు ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


గోపాల్‌పూర్‌లో వరదనీటిలో మునిగిన పత్తి మొక్కలను చూపుతున్న రైతులు


కమలాపురం, మంగపేటల మధ్య గోదావరి వరద తాకిడికి కోతకు గురైన వ్యవసాయ భూములు


కాళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి


కాటారం మండలం మల్లారం వాగులో కొట్టుకుపోయిన వాహనం

పాలెం ప్రాజెక్టుకు జలకళ


విడుదలవుతున్న నీరు

వెంకటాపురం(నూగూరు), జూలై 19 : మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో గల పాలెంవాగు ప్రాజెక్టు శుక్రవారం జలకళ సంతరించుకుంది. మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పడుతున్న వర్షాలకు వరదనీరు పాలెం ప్రాజెక్టులోకి చేరుకుంది. ప్రాజెక్టులో సామర్థ్యానికి మించి వరదనీరు చేరడంతో సంబంధిత అధికారులు 4 గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేశారు. కాగా, పాలెం ప్రాజెక్టు జలకళ సంతరించుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

కాకతీయఖని, జూలై 19: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో కురుస్తున్న వర్షంతో ఓపెన్ కాస్టు ప్రాజెక్ట్-2, 3లలో బొగ్గు వెలికితీత నిలిచిపోయింది. ఎడతెరిపి లేని వర్షాలతో క్వారీల్లో నీరు నిలిచింది. దీంతో కోల్ ఆపరేషన్, ఓవర్ బర్డెన్(ఓబి) పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. రోడ్లు బురదమయం కావడంతో యంత్రాలు కదలలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఉపరితల గని నుంచి బొగ్గును వెలికి తీయడం కష్టతరం అయింది. ఓపెన్ కాస్టు ప్రాజెక్ట్-2లో రోజుకు 2,308 టన్నుల బొగ్గును వెలికితీయాల్సి ఉంది. ఓసీ-3లో 4,077 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాల్సి ఉంది. అయితే శుక్రవారం కురిసిన వర్షం కారణంగా ఒక్క టన్ను బొగ్గు కూడా వెలికి తీయలేదని ఏరియా సింగరేణి అధికారులు చెబుతున్నారు. దీంతో ఓసీ-2, 3ల ద్వారా సింగరేణి సంస్థకు సుమారు రూ.2కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు


రాజు (ఫైల్)

వెంకటాపురం(నూగూరు), జూలై 19: ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామపంచాయతీ పరిధిలోని తానిపర్తికి చెందిన ఓ వ్యక్తి గోదావరిలో గల్లంతయ్యాడు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం... తానిపర్తి గ్రామంలోని బానారి రాజు(45) చేపల వేటకు గురువారం ఉదయం గోదావరి ఒడ్డుకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఆయన తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. రాజు ఆచూకీ కోసం గ్రామస్థులు పడవల సహాయంతో శుక్రవారం గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకుని గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

అన్నారం బ్యారేజీలో పరీక్షలకు బ్రేక్

మహదేవపూర్, జూలై 19 : కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీలో భారీ వర్షాలతో పరీక్షలకు బ్రేక్ పడింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరీక్షలకు అంతరాయం కలిగింది. మొదటి దశ పరీక్షలు జూన్ 21న ప్రారంభం కాగా 15 రోజుల పాటు నిర్వహించారు. మొదటి బృందం పలు వెంట్ల వద్ద డ్రిల్లింగ్ చేస్తూ అత్యాధునిక జియో రాడార్‌తో పరీక్షలు చేసింది. రెండో దశ పరీక్షలకు ముగ్గురు సభ్యుల శాస్త్రవేత్తల బృందం పరీక్షలు చేస్తుండగా పలుమార్లు వర్షాలతో ఆటంకం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

గనుల్లో భద్రతను పెంచుతాం

- ప్రమాదరహిత సంస్థగా సింగరేణిని మార్చుతాం
- రక్షణ త్రైపాక్షిక సమావేశంలో సీఎండీ బలరామ్



సమావేశంలో పాల్గొన్న అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గనుల్లో ప్రమాదాలు జరుగకుండా భద్రతను పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ప్రకటించారు. దీనికోసం కార్మిక సంఘాలు చేసిన సూచనలన్నీ పరిగణనలోకి తీసుకుంటామన్నారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో 48వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష సమావేశం జరిగింది. దీనికి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల ప్రతినిధులు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశం గుర్తింపు కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జనరల్ సెక్రటరీ వి.సీతారామయ్య అధ్యక్షతన జరిగింది. ఇందులో బలరామ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శంగా ఉందని, అలాగే రక్షణలో కూడా ప్రమాద రహిత కంపెనీగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతీ కార్మికుని ప్రాణాలు ఎంతో విలువైనవని, ప్రాణనష్టం జరగకుండా, ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, యాజమాన్యంతో పాటు కార్మికులు కూడా రక్షణ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కోరారు. చాలా ప్రమాదాలు నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్లే చోటు చేసుకుంటున్నాయని విచారం వ్యక్తం చేశారు. రక్షణ లేని పని ప్రదేశాల్లో విధులు నిర్వర్తించాలని యాజమాన్యం ఎప్పుడూ ఒత్తిడి చేయబోదని, అదే సమయంలో ప్రతి ఒక్కరూ కూడా స్వీయ రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా గనుల్లో రక్షణపెంపుదలకు కార్మిక సంఘాలు అనేక సూచనలు చేశాయి, నాణ్యమైన హెల్మెట్లు, బూట్లు సరఫరా చేయాలని, వైద్య సేవలు పెంపుదల, క్యాంటీన్లలో మెరుగైన సౌకర్యాలు, కొత్త యంత్రాల కొనుగోలు, ఆధునీకరణ, అవసరమైన సిబ్బంది నియామకం వంటి అనేక అంశాలపై గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఇతర నాయకులు అనేక సూచనలు చేశారు. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ రీజియన్-2 ఎన్.నాగేశ్వరరావు, ఇతర డీజీఎంఎస్ అధికారులు సింగరేణి వ్యాప్తంగా రక్షణ పెంపుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొన్ని సూచనలు చేశారు. అంతకు ముందు ఇటీవల ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సంతాపం ప్రకటించారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

తాడ్వాయి, జూలై 19: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం ములుగు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వైద్యాధికారులు, సిబ్బంది హాజరు రిజిష్టర్, రోగుల ఓపీ రిజిష్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన చికిత్స పొందుతున్న ముగ్గురు జ్వరపీడితులు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శనివారం కామారం గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం నిర్వహించాలని, గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఆయనవెంట డాక్టర్ చిరంజీవి, స్టాఫ్‌నర్సు, సిబ్బంది ఉన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గోవిందరావుపేట, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రజాపాలన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు రాని లబ్ధిదారులు ప్రజాపాలన సేవ కేంద్రాల ద్వారా డేటా సవరణ చేసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించి కంప్యూటర్‌లో ప్రజాపాలన దరఖాస్తులను పరిష్కరిస్తున్న తీరును పరిశీలించి మాట్లాడారు. అర్హులైన వారికి లబ్ధి చేకూరాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రజాపాలన సేవ కేంద్రాలను కొనసాగిస్తుందని అన్నారు. అనంతరం ఆయన దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం : డీఎస్పీ

ములుగు, జూలై 19: డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని, ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా విద్య, ఉపాధి రంగాలలో రాణించాలని ములుగు డీఎస్పీ ఎన్.రవీందర్ అన్నారు. శుక్రవారం ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, కొకైన్ వంటి మత్తుపదార్థాలను విక్రయించడం, వినియోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కఠిన చర్యలు ఉంటాయన్నారు. వీటికి పొరపాటున అలవాటు పడితే అనారోగ్యానికి గురవుతారన్నారు. ఎవ్వరైనా విక్రయిస్తున్నట్లు, వినియోగిస్తున్న గానీ సమాచారం తెలిస్తే డయల్-100ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న పాల్గొన్నారు.

- మహదేవపూర్ : విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. డ్రగ్స్‌కు బానిసై విద్యార్థులు బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి దివ్యాంగులకు సదరం క్యాంపులు

(5వ పేజీ తరువాయి)

వారు సమీపంలోని మీసేవ కేంద్రంలో ఆధార్‌కార్డుతో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 23న శారీరక వికలాంగులు, కంటిచూపు లేనివారు, 30న శారీరక వికలాంగులు, బుద్ధిమాద్యత, మానసిక రుగ్మత, ఆగస్టు 6వ తేదీన శారీరక వికలాంగులు, వినికిడి లోపం, మూగ, 13న శారీరక వికలాంగులు, కంటిచూపు, 20న శారీరక వికలాంగులు, బుద్ధి మాద్యత, మానసిక రుగ్మత, 27న శారీరక వికలాంగులు, వినికిడి లోపం, మూగ, సెప్టెంబరు 3వ తేదీన శారీరక విలాంగులు, కంటిచూపు, 10న శారీరక వికలాంగులు, బుద్ధిమాద్యత, మానసిక రుగ్మత, 17న శారీరక వికలాంగులు, వినికిడి లోపం, మూగ, 24న శారీరక వికలాంగులు, కంటిచూపు, అక్టోబరు 1వ తేదీన శారీరక వికలాంగులు, బుద్ధిమాద్యత, మానసిక రుగ్మత, 8న శారీరక వికలాంగులు, కంటిచూపు లేని వారికి సదరం క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అర్హులైన దివ్యాంగులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, మెడికల్ రిపోర్ట్స్, అన్నిరకాల మెడికల్ డాక్యుమెంట్లతో హాజరుకావాలని ఆయన సూచించారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

మొగుళ్లపల్లి, జూలై 19 : ముదిరాజ్ కులస్థులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని ముదిరాజ్ కుల సంఘం జిల్లా అధ్యక్షుడు జోరిక సదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్థులు చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేరుస్తామని, ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.100 కోట్ల నిధులను మంజూరు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిందని, అధికారంలోకి రాగానే విస్మరించిందని అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సునీతకు అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ కుల సంఘం నాయకులు దానవేన రాములు, ఆనంద్, శ్రీధర్, నీరటి మహేందర్, దేవునూరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వంశీ


మోడెం వంశీకి ఆర్థిక సాయం చేస్తున్న భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

వాజేడు, జూలై 19: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఆదివాసీ యువకుడు ఎంపికయ్యాడు. మండలంలోని ఇప్పగూడెంకు చెందిన మోడెం వంశీ కొంతకాలంగా భద్రాచలంలో ఉంటూ సిటీ స్టైల్ జిమ్‌లో శిక్షణ తీసుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాడు. ఈక్రమంలో యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో జరిగే పవర్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించాడు. మోడెం వంశీ తల్లిదండ్రులు మోహన్‌రావు, లక్ష్మి ఇంటి వద్దనే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మాల్టా దేశం వెళ్లేందుకు పవర్ లిఫ్టింగ్ ఇండియా అసోసియేషన్‌కు రూ.2.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ దృష్టికి తీసుకెళ్లి వంశీ ఆర్థిక పరిస్థితి వివరించారు. దీంతో తక్షణమే స్పందించిన పీవో శుక్రవారం ఆయన కార్యాలయంలో రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. వంశీని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రటరీ జీవీ రామిరెడ్డి, కోచ్ డాక్టరు శివరామకృష్ణప్రసాద్, ట్రెజరర్ మహంతి వెంకటకృష్ణ, జాయింట్ సెక్రటరీ గుగులోతు శోభన్ నాయక్ అభినందించారు.